సాక్షి
తిరుపతి
ఆదివారం । 23 । మార్చి । 2025



విధుల్లో లేని వైద్యులపై చర్యలు

ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ సేవల సమయంలో డుమ్మా కొట్టే వైద్యులపై కఠిన చర్యలు చేపట్టనున్నారు. - 8లో



శ్రీసిటీ మరో మైలురాయి

శ్రీసిటీ మరో మైలురాయిని దాటింది. కొబెల్కో 20,000వ ఎక్స్కవేటర్‌ను దిగ్విజయంగా విడుదల చేసింది. - 8లో



న్యూస్‌రీల్

ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు


వాటర్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: కలుషితం లేకుండా ఆరోగ్యకరమైన తాగునీటిని ప్రజలకు అందించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం వరల్డ్ వాటర్ డే సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా వాటర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేచురల్ మినరల్ డ్రింకింగ్ వాటర్ (ఎటువంటి కెమికల్, మినరల్స్ కలపకుండా) అందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. క్లౌడ్ టీమ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రసాద్, ఎన్‌జీఈఎన్ ఐఐటీ ఇంకుబ్యేషన్ కంపెనీ ప్రతినిధి రమేష్, అర్జున్‌రాజ్ పాల్గొన్నారు.

ఊసే లేని ఉచిత ఇసుక పాయింట్లు

తిరుపతి అర్బన్: జిల్లాలో రెండో దశ ఉచిత ఇసుక పాయింట్ల ఊసే లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం గత ఏడాది జూలై 8న ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చింది. అధికారులు జిల్లాలోని నాలుగు చోట్ల ఇసుక పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆపై రెండు నెలలకే ఇవి మూతపడ్డాయి. ఆ తర్వాత ఏడు నెలలు కావస్తున్నా ఉచిత ఇసుక పాయింట్లు అందుబాటులోకి రాలేదు. తాజాగా ఈనెల 11న కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈనెల 15వ తేదీ నుంచి గూడూరు ప్రాంతంలోని గూడలి సమీపంలో ఒకటి, పెళ్లకూరు మండలంలోని కలవకూరు వద్ద రెండు ఇసుక పాయింట్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కానీ నేటికీ అవి అందుబాటులోకి రాకపోవడంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,170 మంది స్వామివారిని దర్శించుకోగా 26,821 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.98 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

అడ్మిషన్ డిస్మిస్

- తిరుపతి కొర్లగుంటకు చెందిన ప్రకాష్‌రావు ఓ ప్రైవేటు కంపెనీలో మేనేజర్. కుటుంబ అవసరాల నిమిత్తం తొలిసారి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ నుంచి ఈఎంఐ విధానంతో రూ.70వేలు లోన్ తీసుకున్నాడు. రెండు కంతుల చెల్లింపులో కాస్త ఆలస్యం అయ్యింది. ఫైన్‌తో పూర్తి ఈఎంఐలను చెల్లించాడు. తన కుమారుడు బీటెక్ పూర్తి చేసి కన్సల్టెన్సీ తరపున ఎంఎస్ చేసేందుకు ఆస్ట్రేలియాలో సీటు సాధించాడు. అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా విద్యార్థి తల్లిదండ్రుల ఆర్థికస్థితిగతులపై బ్యాంక్ స్టేట్‌మెంట్, సిబిల్ స్కోర్‌ను అధికారులు పరిశీలించారు. సిబిల్ స్కోర్ 480 ఉండడంతో ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ విద్యార్థికి అడ్మిషన్‌ను నిరాకరించారు.

.. ఇది ఒక్క ప్రకాష్ పరిస్థితే కాదు. జిల్లాలో చాలామంది పరిస్థితి ఇదే విధంగా కొట్టుమిట్టాడుతోంది. సకాలంలో రుణాలు చెల్లించక.. అవసరాలకు రుణాలందక ఆర్థికంగా చితికిపోవాల్సి వస్తోంది. సిబిల్ స్కోర్ పరిగణనలోకి తీసుకోకుండా తప్పటడుగులు వేయాల్సి వస్తోంది.

పెళ్లి క్యాన్సిల్

- మహారాష్ట్రలోని మూర్తిజాపూర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఐటీ ఉద్యోగి. ఐదు లోన్లు తీసుకుని బండి, ఇల్లు కొనుగోలు చేసి పెళ్లికి ప్రయత్నాలు చేశాడు. ఇంట్లో పెద్దలు ఓ సంబంధం చూసి ఓకే చేశారు. ఇంతలో పెళ్లి కుమార్తె తండ్రి పెళ్లికుమారుని బ్యాంక్ అకౌంట్, పాన్‌నంబర్ తీసుకుని సిబిల్ స్కోర్ చెక్ చేశాడు. సిబిల్ స్కోర్ 500 కన్నా తక్కువగా ఉండడంతో షాకయ్యాడు. ఆర్థిక భరోసా కల్పించలేరని గ్రహించి అమ్మాయిని ఇచ్చేదిలేదని తెగేసి చెప్పాడు. దీంతో పెళ్లి రద్దు చేసుకున్నారు.



సిబిల్..గుబుల్!

సిబిల్ స్కోర్ తగ్గితే భవిష్యత్ గోవిందా!

- బ్యాంకు రుణాలు అందడం గగనమే
- సిబిల్ స్కోర్‌లో పురుషుల కంటే మహిళలే టాపర్స్
- జిల్లాలో 60శాతం మందిపై ప్రభావం

తిరుపతి సిటీ:ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు, ఆకాంక్షలను సాకారం చేసుకునేందుకు క్రెడిట్ కార్డులు, రుణాలపై ప్రజలు ఆధార పడుతుంటారు. వీటిని పొందడంలో సిబిల్ స్కోర్ కీలక పాత్ర పోషిస్తోంది. రుణాలిచ్చేటప్పుడు బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణను పరిగణలోకి తీసుకుంటాయి. దీంతో చాలామంది మూడంకెల సంఖ్యను మెరుగుపరుచుకోవడానికి ఆరాటపడుతుంటారు.

సిబిల్ స్కోర్ అంటే...

సిబిల్ స్కోర్ అంటే వ్యక్తి, సంస్థ, కంపెనీల క్రెడిట్ చరిత్రను గణనచేసేందుకు 2017లో రిజర్వు బ్యాంక్ అనుమతి పొందిన సంస్థ. క్రెడిట్ చరిత్రను తెలుసుకోవడానికి దేశంలో నాలుగు సంస్థలు ఉన్నాయి. అందులో ప్రధాన మైంది క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇండియా లిమిటెడ్ (సీబీఐఎల్). దీనినే సిబిల్‌గా పిలుస్తుంటారు.

సిబిల్ స్కోర్ టాపర్స్ మహిళలే

జిల్లాలో రుణాలు తీసుకుంటున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. పురుషుల కంటే స్త్రీలు తమ కంతుల చెల్లింపులలో అగ్రస్థానంలో ఉంటూ సిబిల్ స్కోర్‌ను కాపాడుకుంటున్నారు. జిల్లాలో సుమారు 91శాతం మంది మహిళలు 800ప్లస్ స్కోర్‌లో ఉన్నారంటే అతిశయోక్తికాదు.

సిబిల్ స్కోర్ పెంచుకోండి ఇలా

- రుణాల చెల్లింపులు, ఈఎంఐలు, క్రెడిట్ కార్డుల చెల్లింపులు సకాలంలో చేయాలి
- పాత బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డులను కొనసాగించాలి.
- క్రెడిట్ లిమిట్‌ను పూర్తిగా వాడేయొద్దు
- పదేపదే రుణాలకు దరఖాస్తు చేయొద్దు
- రుణాల చెల్లింపులో కంతులను సక్రమంగా చెల్లించాలి
- జాయింట్ అకౌంట్లతో రుణాలను తీసుకోకపోవడం మంచిది.
- అన్‌సెక్యూర్డ్ రుణాలను తక్కువ తీసుకోవాలి
- ఒకే వ్యక్తి స్థోమతకు మించి ష్యూరిటీ లేని రుణాలను తీసుకోవద్దు

సిబిల్ స్కోర్ ఆశాజనకంగా ఉంటే ప్రయోజనాలు ఇవే..

- అవసరమైన వెంటనే రుణాలు
- తక్కువ వడ్డీతో ఎక్కువ రుణం
- ష్యూరిటీలతో పని ఉండదు
- ఎక్కువ కాలపరిమితి గల రుణాలు
- గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు పొందడానికి హామీలతో పనిలేదు
- క్యాష్ బ్యాక్ సౌకర్యం, ఎంపిక చేసిన కొనుగోళ్లపై రివార్డులు
- ప్రీ అప్రూవ్డ్ రుణాల పేరుతో బ్యాంకులు, ప్రైవేటు సంస్థలు స్వయంగా రుణాలను ఆఫర్ చేస్తాయి.
- సాధారణ బీమా పాలసీలకు ప్రీమియం తగ్గింపు
- ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకుల నుంచి ప్రీమియం క్రెడిట్ కార్డులు పొందే అవకాశం



సిబిల్ స్కోర్ ఎంత ఉండాలంటే...

సాధారణంగా సీబిల్ స్కోర్ 300 నుంచి 900 మధ్య ఉంటుంది. 550 కంటే తక్కువ ఉంటే రుణాల మంజూరుకు బ్యాంకులు అనుమతించవు. 750నుంచి 900 అత్యుత్తమ స్కోర్, 650 నుంచి 750 ఉంటే మంచి స్కోర్, 550 నుంచి 650 యావరేజ్, 300 నుంచి 550 ఉంటే డేంజర్ స్కోర్.

సిబిల్ స్కోర్ తగ్గడానికి కారణాలు

ఆదాయానికి మించి రుణాలు పొందడం, రుణాల చెల్లింపులలో అలసత్వం, ప్రభుత్వ ఉద్యోగులకు నెల మొదటి వారంలో సక్రమంగా వేతనాలు అందకపోవడం, రుణగ్రస్తులైన వ్యాపారుల ఆర్థికలావాదేవీలలో ఆలస్యం, ఆకస్మిక ఉద్యోగాల తొలగింపు, గ్రామీణ రైతుకు గిట్టుబాటు ధర అందకపోవడం వంటివి సిబిల్ స్కోర్ తగ్గడానికి ప్రధాన కారణాలు.

సిబిల్ స్కోర్ ఎలా లెక్కిస్తారంటే!

- గత 36 నెలల రుణగ్రస్తుల క్రెడిట్ ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.
- రుణాలు, క్రెడిట్ కార్డులు, ఆటోమొబైల్స్, పర్సనల్, ఓవర్‌డ్రాఫ్ట్ చెల్లింపులను తీసుకుంటారు.
- పేమెంట్ హిస్టరీ 40శాతం ప్రధాన భూమిక పోషిస్తుంది.
- పరిమితికి మించి వాడుకుంటే క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. సిబిల్ స్కోర్ లెక్కింపులో 30 శాతం ప్రభావం చూపుతుంది.
- తక్కువ సమయంలో బహుళ రుణాలు తీసుకోవడం కారణంగా సిబిల్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది.
- హామీ రహిత రుణాలు ఎక్కువగా ఉంటే సిబిల్ స్కోర్ తగ్గే అవకాశం ఉంటుంది.

సిబిల్ స్కోర్ తెలుసుకోవడం ఇలా..

సిబిల్ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేరు, ఫోన్ నంబర్, ఈమెయిల్, పాన్ నంబర్ నమోదు చేయాలి. ఖాతా క్రియేట్ అయిన తర్వాత లాగిన్, పాస్‌వర్డ్ డీటైల్స్‌తో ఖాతాలోకి ప్రవేశించి రుణాలు, క్రెడిట్ కార్డుకు సంబంధించిన వివరాలు తెలపాలి. వెంటనే డ్యాష్‌బోర్డుపై సివిల్ స్కోర్ వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఒకసారి మాత్రమే ఉచితంగా సిబిల్ స్కోర్ తెలుసుకోవచ్చు. అలాగే రూ.550 ఆన్‌లైన్ ద్వారా చెల్లించి సిబిల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి నోయువర్ స్కోర్‌ను క్లిక్ చేయాలి. ఐదు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. అనంతరం 24 గంటల్లో మీ సిబిల్ స్కోర్ వివరాలు ఈమెయిల్‌కు పంపుతారు.

సిబిల్ స్కోర్‌తో అప్రమత్తంగా ఉండాలి



“రుణగ్రస్తులు సిబిల్ స్కోర్ పట్ల నిర్లక్ష్యం వహించొద్దు. జిల్లాలో సుమారు 60శాతం మంది రుణగ్రస్తులకు 550లోపు స్కోర్ ఉంది. సక్రమంగా రుణాల చెల్లించకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు.- నరసింహస్వామి, పేరొందిన ప్రభుత్వ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్, తిరుపతి

భవిష్యత్తుపై ప్రభావం



ప్రైవేటు, ప్రభుత్వ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు రుణగ్రస్తుల అవసరాలకు రుణాలను మంజూరు చేస్తాయి. వాటిని గడువు లోపు చెల్లిస్తే ఇబ్బంది ఉండదు. లేనిపక్షంలో రుణగ్రస్తుని ఆర్థిక స్థితికి మించి అపరాధం కట్టుకోవాల్సి ఉంటుంది. - రవిచంద్రారెడ్డి, ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ, సేల్స్ మేనేజర్, తిరుపతి

రుయా ఆస్పత్రికి రూ.5.25 కోట్లతో పరికరాలు

తిరుపతి అర్బన్: తిరుపతిలోని రుయా ఆస్పత్రికి రూ.5.25 కోట్లతో వైద్య పరికరాలు కొనుగోలు చేయడానికి గుర్గాన్ ఫౌండేషన్ వారు కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఆ మేరకు కలెక్టర్ నేతృత్వంలో శనివారం కలెక్టరేట్‌లో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. దీనికి విజయవాడ ప్రాంతీయ విభాగం పరిధిలోని చీఫ్ ప్రోగ్రాం ఆఫీసర్ సంజయ్ కుమార్ రాయ్, రీజనల్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్ సింగ్ విచ్చేశారు. తిరుపతి ఎస్వీ ఆర్‌ఆర్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పర్యావేక్షణాధికారి డాక్టర్ రవి ప్రభు సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.


కలెక్టర్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

రేపటి నుంచి గ్రీవెన్స్ ఉదయం 9 గంటలకే

తిరుపతి అర్బన్: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో సోమవారం నుంచి ఉదయం 9గంటలకే గ్రీవెన్స్ ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లోనే కాకుండా డివిజన్, మండల స్థాయి కార్యాలయాల్లోనూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రీవెన్స్ నిర్వహించాలని తెలిపారు. అధికారులందరూ గ్రీవెన్స్‌కు హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ప్రాణాలు తీసిన అతి వేగం!

అతివేగం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. ఒకే బైక్‌పై మితిమీరిన వేగంతో వెళ్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఇద్దరు యువకులతోపాటు ఆటో డ్రైవర్ దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది.

- ఆటోను బైక్ ఢీకొని ముగ్గురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు ఐటీఐ విద్యార్థులు, ఆటో డ్రైవర్


ఘటనా స్థలంలో మృతి చెందిన వరుణ్‌కుమార్


ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ


సురేంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మనుబోలు/సైదాపురం:అతి వేంగంతో బైక్ నడుపుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, మనుబోలు మండలంలోని గొట్లపాళెం వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. సైదాపురం మండలం ఊటుకూరు దళితవాడుకు చెందిన నోసిన వెంకటేశ్వర్లు కుమారుడు వరుణ్‌కుమార్ (18), అర్తనపల్లి శంకరయ్య కుమారుడు నందకిశోర్ (18), మరో కుమారుడు అర్తనపల్లి ఈశ్వర్ ముగ్గురూ మిత్రులు. వీరిలో వరుణ్‌కుమార్, నందకిశోర్ గూడూరులోని ఓ కళాశాలలో ఐటీఐ చదువుతున్నారు. ఈ ముగ్గురూ కలిసి బైక్‌పై నెల్లూరుకు పనిమీద వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గొట్లపాళెంలో ఉంటున్న వరుణ్ అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు నెల్లూరు నుంచి కసుమూరు, వడ్లపూడి మీదుగా వేగంగా వస్తున్నారు. అదే సమయంలో పొదలకూరు నుంచి ప్రయాణికులతో వడ్లపూడి వెళుతున్న ఆటోను ఎదురెదురుగా వచ్చిన బైక్ అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వరుణ్‌కుమార్, నందకిషోర్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్ తురకా సురేంద్ర (38) తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై వెనుక ఉన్న ఈశ్వర్‌తోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను పొదలకూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేంద్ర మృతి చెందాడు. మృతులు ముగ్గురివి పేద కుటుంబాలే. అతి వేగం, నిర్లక్ష్యం మూడు కుటుంబాలను రోడ్డుపాల్జేసింది. నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, మనుబోలు ఎస్‌ఐ శివరాకేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కుటుంబాల్లో విషాదం

ఈ ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం మిగిల్చింది. ఊటుకూరుకు చెందిన ఇద్దరు యువకులు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చేతికొచ్చిన కుమారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డున పడిన ఆటో డ్రైవర్ కుటుంబం

ఆటో డ్రైవర్ సురేంద్రది పొదలకూరు కాగా అతను వడ్లపూడిలో పెళ్లి చేసుకుని ఇల్లిరికం వచ్చి ఇక్కడే ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సురేంద్రకు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.



SUNDAY SPECIAL

డ్యూయెట్.. వెడ్డింగ్ షూట్!

- జిల్లాలో పెరిగిన ప్రీ వెడ్డింగ్ షూట్లు
- సినిమాను తలపించేలా చిత్రీకరణ
- ప్రత్యేక స్థలాలు, బీచ్‌లు ఎంపిక
- షూటింగ్‌కు రూ.లక్షల్లో వ్యయం
- ప్యాకేజీల పేరుతో ఆఫర్లు
- అధిక ప్రాధాన్యం ఇస్తున్న కొత్త జంటలు

ఫొటో షూట్‌ల సందడి ఇటీవల బాగా ఎక్కువైంది.. ఏ శుభకార్యం జరిగినా స్పెషల్ ఫొటో షూట్ ఉండాల్సిందే.. ఇక పెళ్లిళ్ల విషయానికొస్తే ప్రీ వెడ్డింగ్.. పోస్ట్ వెడ్డింగ్.. సాంగ్ షూటింగ్ అంటూ హంగామా చేస్తున్నారు. ఇప్పుడు ఓ మంచి లోకేషన్‌లో చిన్నపాటి సినిమాను తలపించేలా.. సెట్టింగ్‌లు.. యాక్షన్.. అంటూ టేకులు తీసుకుంటూ కొత్త జంటలు మురిసిపోతున్నాయి. ఇందులో పాటలు.. అదిరిపోయే సీన్‌లు.. వెరైటీ ఫోజుల్లో నూతన జంటలు కొత్త లుక్స్‌తో కనిపిస్తున్నాయి. ఈ నయా ట్రెండ్ జిల్లాకు పాకింది. పెళ్లికి అయ్యే ఖర్చులను మించిపోతున్నా ఎవరూ తగ్గదేలేదంటూ కొత్త జంటలు ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ షూట్‌లను బాగా లైక్ చేస్తున్నారు.

కాణిపాకం: పెళ్లి.. జీవితాంతం గుర్తుండిపోయే మధుర వేడుక. ఆ సంబరాలకు సంబంధించిన జ్ఞాపకాలు భద్రంగా ఉండాలి కదా! అందుకో మార్గం ఉంది.. ఫొటో, వీడియో షూట్. అయితే.. ఈ మధ్య ఫొటో, వీడియో షూట్‌ల ట్రెండ్ మారింది. పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ షూట్, కపుల్ షూట్ తప్పనిసరి అయిపోయాయి. సినిమాను తలపించే లైటింగ్, ఎఫెక్ట్స్, సెట్టింగులతో ఫొటో, వీడియో షూట్లు నిర్వహిస్తున్నారు. చేయి తిరిగిన ఫొటోగ్రాఫర్, అత్యాధునిక కెమెరా, స్వర్గాన్ని తలపించే లొకేషన్స్ ఎంపిక చేసుకుని ప్రీ వెడ్డింగ్‌లో కిసిక్..కిసిక్‌కుగా కొత్తజంటలు మైమరిచిపోతున్నాయి. పెళ్లంటే పందిళ్లు....సందళ్లు తప్పెట్లు..తాళాలు తలంబ్రాలూ మూడుముళ్లు..ఏడడు గులు ఇదీ అందరికీ తెలిసిందే. కానీ ప్రస్తుతం వీటి తో పాటు పెళ్లి వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. పెళ్లి సంబరాలు చెదరని మధుర జ్ఞాపకంలా జీవితాంతం గుర్తుండిపోయేలా యువతీ యు వకులు పెళ్లికి సిద్ధం అవుతున్నారు. ఇందులో భా గంగా ప్రీవెడ్డింగ్ షూట్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలో ఈ ప్రీ వెడ్డింగ్ షూట్ ట్రెండ్‌గా మా రింది. కొత్తగా పెళ్లి ఫిక్స్ అయితే ముందుగా ప్రీ వెడ్డింగ్ ఫొటో, వీడియో షూట్‌కు రెడీ అవుతున్నారు.

అదిరేలా...

గతంలో పెళ్లయ్యాక హనీ మూన్‌కు ఎక్కడికెళ్లాలి అంటూ అందరితో ఆరా తీసేవారు. ఇప్పుడు నిశ్చితార్థం కాకముందే ప్రీవెడ్డింగ్ ఫొటో, వీడియో షూట్‌కు సిద్ధమవుతున్నారు. అందమైన ప్రదేశంలో ఫొటో, వీడియో షూట్లు తీసే లా ముందస్తుగా ప్లాన్ చేసుకుంటున్నారు. వివాహానికి ముందే వధూ వరులు తమ హావభావాలు, సంభాషణలు, సాన్నిహిత్యాన్ని చిత్రీకరించుకుంటున్నారు. భిన్న కోణాల్లో చూసు కుని మురిసిపోయేందుకు.. రేపటి తరానికి చూపించేందుకు ఎంత వ్యయమైనా వెచ్చించేందుకు వెనుకాడడం లేదు.

ప్యాకేజీలతో...

గతంలో పెళ్లికి ఫొటోలు, వీడియో తీయించుకోవాలంటే తెలిసిన ఫొటోగ్రాఫర్లకు చెప్పుకునేవాళ్లు. కానీ ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కేవలం ప్రీ వెడ్డింగ్ షూట్ కాకుండా ఆల్బమ్, వీడియోలు అన్ని కలిపి ప్యాకేజీగా తీసుకుంటున్నారు. దీనికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పలు రకాల ప్యాకేజీలున్నాయి. ఇందులో ప్రీ వెడ్డింగ్ షూట్, పోస్ట్ వెడ్డింగ్ షూట్స్ ఉంటాయి. వివాహానికి కొద్ది రోజుల ముందు, వివాహమైన తర్వాత రెండు రోజుల పాటు ప్రత్యేకంగా షూటింగ్ చేసి వీడియోలను చిత్రీకరిస్తున్నారు. పెళ్లి సీజన్‌లను బట్టి ఫొటో, వీడియో గ్రాఫర్లు ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు.

ఈ ప్రాంతాల్లోనే...

జిల్లాలోని రిసార్ట్‌లు, పెద్ద హోటల్ ప్రాంతాలు, రద్దీగా లేని జాతీయ రహదారులు, తమిళనాడులోని వేలూరు, చెన్నై బీచ్, సినిమా స్పాట్లు, పాండిచ్చేరిలోని బీచ్, సినిమా చిత్రీకరించిన ప్రదేశాల్లో ఫొటో, వీడియో షూట్‌కు ఇష్టపడుతున్నారు. కర్ణాటకలోని జారువాలే జలపాతాలు, పొగ మంచుతో కమ్ముకునే ఉండే ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. పల్లె ప్రాంతాల్లో పచ్చని పంట పొలాలు, కొబ్బరి తోటల గట్ల మీద, చెరువులు, పచ్చదనం పరుచుకున్న కొండ ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు.



ప్రీ వెడ్డింగ్‌తో పనులొచ్చాయి



“ముందు అయితే పెళ్లి సీజన్‌లో మాత్రమే గిరాకీలుండేవి. ప్రస్తుతం నడుస్తున్న నయా ట్రెండ్ వల్ల కాస్త చేతికి కావాల్సినంత పని దొరికింది. ప్రీ వెడ్డింగ్ షూట్ల వల్ల పెళ్లికి ముందు ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల గిరాకీలు వస్తున్నాయి. మంచి నైపుణ్యం ఉన్న వారికి భలే డిమాండ్ ఉంది. అత్యాధునిక కెమెరాలనే షూట్‌కు వినియోగిస్తున్నాం.

– కృష్ణంరాజు, ఫొటోగ్రాఫర్, చిత్తూరు



సాంకేతికతతో.. అద్భుతంగా చిత్రీకరణ

‘ప్రీ వెడ్డింగ్ షూట్’ ద్వారా ఆధునిక కెమెరాలతో ఓ సినిమా పాటలా చిత్రీకరిస్తున్నారు. దీంతో పాటు జీవితాంతం గుర్తుండిపోయేలా ఫొటోకు అదిరిపోయేలా ఫోజులిస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్‌ను చిత్రీకరించేందుకు హైడెన్సిటీ (హెచ్‌డీ) టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. మంచి క్వాలిటీ ఉన్న కెమెరాలను ఉపయోగిస్తున్నారు. ఒక షూట్ చేయడానికి కనీసం నలుగురు కెమెరామెన్లు పనిచేస్తున్నారు. డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. మూడు నుంచి 4 నిమిషాల నిడివిగల పాటకు సుమారు 2 నుంచి 3 రోజుల పాటు పనిచేస్తారు. ఒక పాటకు ఒక్కోసారి ప్రదేశాలను మార్చాల్సి ఉంటుంది. ప్రదేశం మారిన సమయంలో దుస్తులను మార్చుకోవడం, మేకప్ వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వడంతో సమయం ఎక్కువ పడుతుంది. చిత్రీకరణను పాట రూపంలో తీసుకొచ్చేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంటోంది.

మీమ్స్ నయా ట్రెండ్

నూతన దంపతులు దిగిన ఫొటోలు, వీడియోలను మీమ్స్ మార్చి వాటిని పెళ్లిలోనే ప్రదర్శించి నవ్వులు పూయిస్తున్నారు. ఎల్‌ఈడీ తెరను ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి వీక్షిస్తున్నారు. ఈ క్షణాలనూ వీడియో తీసుకుంటున్నారు. ప్రీవెడ్డింగ్ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో రీల్స్ పెట్టడానికి ఎక్కువ జంటలు ఆసక్తి చూపిస్తున్నాయి. అలాగే కుటుంబంలో చనిపోయిన కుటుంబీకులను కూడా బతికి ఉన్నట్లుగా చూపిస్తున్నారు. వధూ వరులను ఆశీర్వదించేలా, కుటుంబీకులతో కలిసి ఫొటోలు దిగేలా తెర మీద చూసుకుంటున్నారు. ఇలాంటి వాటికి ఇప్పుడు మరింత క్రేజ్ ఏర్పడింది.

విధుల్లో లేని వైద్యులపై చర్యలు

తిరుపతి తుడా: ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ సేవల సమయంలో విధుల్లో లేని వైద్యులపై మెడికల్ ఎడ్యుకేషన్ పరిపాలన డైరెక్టర్ వెంకటేష్ కన్నెర్ర చేశారు. విధులకు డుమ్మా కొట్టిన వైద్యులకు వెంటనే మెమోలు జారీ చేయాలని ఆయన ఆదేశించారు. రుయాలో తిష్ట వేసిన సమస్యలు, లోటుపాట్లు పరిష్కరించేందుకు శనివారం ఆయన విజయవాడ నుంచి వచ్చారు. అత్యవసర విభాగం, ఓపీ విభాగాలు, వివిధ వార్డులు, ల్యాబ్‌లను ఆకస్మిక తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓపీ సేవలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో అల్ట్రా సౌండ్ స్కానర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ సుబ్బ లక్ష్మమ్మ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

పరిశోధనల్లో సమన్వయం అవసరం


పుస్తక సంపుటిని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: సమకాలీన పరిశోధనా రంగంలో సాంకేతికతను, బహుళ విభాగాత్మక సిద్ధాంతాలను సమన్వయ పరచడం అవసరమని ఏపీఎస్‌ఈహెచ్‌ఈ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరి దేవి పేర్కొన్నారు. పద్మావతి మహిళా వర్సిటీ వేదికగా 'రీసెంట్ డిసిప్లినరీ ట్రెండ్స్ ఇన్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే అంశంపై రెండు రోజుల పాటు కొనసాగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఇందులో ఆమె మాట్లాడుతూ వైజ్ఞానిక, మానవీయ శాస్త్రాల అనుసంధానం కొత్త ఆవిష్కరణలకు అవకాశం కల్పించి యువతకు స్ఫూర్తిదాయకమవుతాయని తెలిపారు. అనంతరం రిజిస్ట్రార్ రజనీ మాట్లాడారు. సదస్సుకు సంబంధించిన రెండో పుస్తక సంపుటాన్ని ఆవిష్కరించారు. డీన్ ఆచార్య టీ.సుధ, సెమినార్ కన్వీనర్ ఆచార్యశారద, కో కన్వీనర్ ఆచార్య నిర్మల పాల్గొన్నారు.

విద్యార్థికి స్వీడన్‌కు ఆహ్వానం


స్వీడన్‌కు వెళ్లనున్న ఐజర్ విద్యార్థి అలగరాసన్

ఏర్పేడు(రేణిగుంట): తిరుపతి ఐజర్ విద్యార్థికి అరుదైన అవకాశం దక్కింది. ఈనెల 26, 27 తేదీలలో స్వీడన్ దేశంలోని ఒమియాలో జరగనున్న మొక్కల శాస్త్రవేత్తల యూపీఎస్‌సీ సింపోజియం కార్యక్రమంలో ఐజర్ బయాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వరయ్య రామిరెడ్డి గైడెన్స్‌లో పీహెచ్‌డీ విద్యార్థి జి.అలగరాసన్ పాల్గొనేందుకు బయల్దేరి వెళ్లారు. తమ విద్యార్థికి అరుదైన అవకాశం దక్కడంపై ఐజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య సంతోషం వ్యక్తం చేశారు.

నాడు జలకళ..నేడు వెలవెల !



తిరుపతిలోని కపిలతీర్థం గత ఏడాది జలకళతో భక్తులను ఆకట్టుకుంది. అయితే ఈ ఏడాది వర్షాలు లేక ఎండల తీవ్రత పెరగడంతో ఎండిపోయి కళావిహీనంగా కనిపిస్తోంది.
– సాక్షి, ఫొటోగ్రాఫర్, తిరుపతి



శ్రీసిటీ మరో మైలురాయి

- కొబెల్కో 20,000వ ఎక్స్‌కవేటర్ విడుదల


ఎక్స్‌కవేటర్‌ను జలందర్ రెడ్డికి అందజేస్తున్న కేసీఈఐ ఎండీ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ మరో మైలురాయిని అధిగమించింది. నిర్మాణ పరికరాల తయారీ దిగ్గజ కంపెనీ కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ ఇండియా (కేసీఈఐ) శ్రీసిటీ ప్లాంట్‌లో 20,000వ ఎస్‌కే-220 ఎక్స్‌కవేటర్‌ను విడుదల చేసింది. శనివారం కంపెనీ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ అద్భుత విజయం పట్ల కొబెల్కో పరిశ్రమకు ఆయన అభినందనలు తెలిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి, కేసీఈఐ సేల్స్ - మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్ సమక్షంలో కేసీఈఐ ఎండీ- సీఈఓ టకేమిచి హిరకావా లాంఛనంగా 20,000వ ఎక్స్‌కవేటర్‌ను విడుదల చేసి, దానిని తమ ప్రధాన కస్టమర్ కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.జలందర్‌రెడ్డికి అందజేశారు. కేసీఈఐ బృందాన్ని డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. కేసీఈఐ ప్లాంట్‌లో కొత్త ఆర్అండ్‌డీ సదుపాయం ఏర్పాటును ఆయన ప్రశంసించారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలు

- నకిలీ యాప్‌లతో రూ.55.85 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి రూరల్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఓ కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలు పడింది. నకిలీ యాప్‌ల కారణంగా రూ.55.85 లక్షల వరకు పోగొట్టుకుంది. ఈ ఘటన తిరుపతి రూరల్ మండలం, సాయినగర్ పంచాయతీ, టెలిఫోన్ కాలనీలో వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ పోలీసుల సమాచారం మేరకు... టెలిఫోన్ కాలనీకి చెందిన ఓ కాంట్రాక్టు ఉపాధ్యాయురాలు వాట్సాప్ నంబరును INVESTMENT ALLIANCE TRAINING A GROUP, VIP C9 HARISNG BOOK DISCUSSION, CANAN ASSESTS DATA అనే వాట్సాప్ గ్రూపులకు సైబర్ నేరగాళ్లు యాడ్ చేశారు. ఈ గ్రూపులకు అడ్మిన్లుగా హరిసింగ్ 9007947098, 9831236695, 7991303239 కెనాన్ అసెట్స్ వ్యవహరించారు. అధిక లాభాలను ఆశజూపించి ఆమెను నమ్మించారు. క్వాలిటీ పవర్ ఐపీవో, బీజాసన్ ఐపీవో, హెక్సావేర్ టెక్నాలజీ ఐపీవో అన్న స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టమని ప్రేరేపించారు. దీంతో ఆమె బంధన్ బ్యాంకు, ఐడీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యుకో, ఆర్ఎంజీబీ బ్యాంకు వంటి పది బ్యాంకు ఖాతాలకు రూ.55.85 లక్షలు జమ చేసింది. ఆ తర్వాత కొన్ని రోజులకు ఆ వాట్సాప్ గ్రూపులన్నీ క్లోజ్ చేయడం, నిర్వాహకులుగా అప్పటి వరకు మాట్లాడిన ఫోన్ నంబర్లు పనిచేయకపోవడంతో తాను మోసపోయినట్టు తెలుసుకుంది. ఆపై ఆ మహిళ సైబర్ క్రైమ్ 1930కు ఫిర్యాదు చేశారు. అనంతరం తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు ఫిర్యాదు చేయగా.. ఆయన వివరాలు సేకరించుకుని కేసు నమోదు చేశారు.

పది పరీక్షలకు 17 మంది గైర్హాజరు

తిరుపతి అర్బన్: పదో తరగతి ఓపెన్ స్కూల్, కాంపోజిట్ కోర్సు పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరినట్టు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 100 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 11.15 గంటల వరకు కాంపోజిట్ కోర్సు పరీక్షలు జరిగాయని చెప్పారు. మూడు సెంటర్లలో ఓపెన్ స్కూల్ పరీక్షలు జరిగాయని తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 8,412 మంది హాజరవ్వాల్సి ఉండగా అందులో 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు వెల్లడించారు.

వచ్చే నెల 6 నుంచి తాతయ్యగుంట గంగమ్మ జాతర


మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు

తిరుపతి కల్చరల్: శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు తెలిపారు. అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు మొదటి విడతలో రూ.3.75 కోట్లు కేటాయించినట్లు వివరించారు. రెండో విడత అభివృద్ధి పనులకు రూ.3.90 కోట్లతో ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. మే 6 నుంచి 13వ తేదీ వరకు గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సహకారం అందిస్తుందన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, ఎం.శాంతారాం, సీఈ సత్యనారాయణపాల్గొన్నారు.

రామచంద్రాపురం ఎస్ఐపై బదిలీ వేటు

- తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌కు అటాచ్‌మెంట్
- అధికార పార్టీకి అనుకూలంగా లేకపోవడమే కారణమా?


బదిలీపై వెళ్లిన ఎస్ఐ రామాంజనేయులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రామచంద్రాపురం మండల ఎస్ఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డిపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు బదిలీ వేటు వేశారు. ఎస్ఐని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. హెడ్ కానిస్టేబుల్‌ని వీఆర్‌కు బదిలీ చేసినట్టు సమాచారం. ఆ ఇద్దరూ శనివారం తిరుపతి ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొన్ని రోజులుగా చెలరేగిపోతున్న మట్టి మాఫియాకు ఎస్ఐ రామాంజినేయులు వార్నింగ్‌లు ఇవ్వడం ప్రారంభించారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీకి చెందిన వారిపై కేసులు పెట్టాలని, వారిని కొట్టాలన్న ఒత్తిళ్లను ఆయన లెక్క చేయలేదు. దీనిపై అధికార పార్టీకి చెందిన నేతలు ఎస్ఐపై గుర్రుగా ఉన్నట్టు సమాచారం. దీనికి తోడు రెండు రోజుల క్రితం సి.రామాపురం వద్దనున్న ఓ మద్యం దుకాణానికి కొంత దూరంలో రాత్రిపూట వాహనాలు తనిఖీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. దీంతో అధికార పార్టీకి చెందిన ఆ మద్యం దుకాణ యజమాని స్థానిక టీడీపీ నేతకు సమాచారం చేరవేశాడు. అప్పటికే ఆగ్రహంగా ఉన్న అధికార పార్టీ నేతలు అందరూ ఆ ఎస్ఐకి అవినీతి మరకలు అంటించి బదిలీకి పట్టుపట్టారు. దీంతో ఎస్ఐ రామాంజనేయులును అక్కడి నుంచి బదిలీ చేసి తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించినట్టు సమాచారం.

భయపడ్డారా?

- రైల్లో నుంచి విసిరేసిన గంజాయి ప్యాకెట్ల బ్యాగ్


డీపీ సత్రం రైల్వే స్టేషన్‌లో లభ్యమైన గంజాయి ప్యాకెట్లు

దొరవారిసత్రం: రైల్లో నుంచి గంజాయి ప్యాకెట్లు కలిగి ఓ బ్యాగును గుర్తుతెలియని వ్యకుత్తులు విసిరేసిన ఘటన దొరవారిసత్రం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకోగా శనివారం వెలుగులోకి వచ్చింది. సూళ్లూరుపేట జీఆర్పీ పోలీసుల కథనం.. కామాఖ్య నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి గుర్తుతెలియని వక్తులు దొరవారిసత్రం రైల్వే స్టేషన్‌లో ఓ బ్యాగ్‌ను విసిరివేశారు. దీన్ని గమనించిన స్థానిక స్టేషన్ అధికారులు బ్యాగు తీసి చూడగా నాలుగు గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. అనంతరం జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్పీ ఎస్ఐ చెన్నకేశవ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.